# జనరల్ స్టడీస్

## ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు - 2017

దేశాభివృద్ధి, పురోగతి కోసం ఆర్థిక వ్యవస్థ గాడి తప్పకుండా ఉండాలంటే సరైన విత్తవిధానం, నియంత్రణాపరమైన చర్యలు అనివార్యం. దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలదే క్రియాశీల భూమిక. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే ఆర్థిక సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారితే అనుసరించాల్సిన ఉద్దీపన చర్యలకు కేంద్రం ఉపక్రమిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు తెరమీదకు వచ్చింది. ఈ బిల్లులోని కొన్ని ప్రతిపాదనలు అత్యంత వివాదాస్పదం కావడంతో దేశవ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది.

దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు, బీమా కంపెనీలు, ఆర్థిక సంస్థలు విపత్కర పరిస్థితుల్లో కూరుకుపోయినప్పుడు వాటిని ఆదుకోవడం, డిపాజిట్‌దారులు దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలన్న లక్ష్యంతో 'ఆర్థిక సుస్థిరత, డిపాజిట్ ఇన్సూరెన్స్' (ఎఫ్.ఆర్.డి.ఐ.) బిల్లును కేంద్రం 2017, ఆగస్టు 10న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇది సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనలో ఉంది. నిర్దిష్ట సవరణలతో ఈ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును ఆమోదింపజేయాలని కేంద్రం దృఢ సంకల్పంతో ఉంది. బిల్లు రూపకల్పనలో విస్తృతంగా మేధోమథనం జరిపిన ప్రభుత్వం దీన్ని ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేసే దిశగా వేసిన ముందడుగుగా పేర్కొంటోంది. డిపాజిట్‌దారులు మాత్రం తమ ప్రయోజనాలను దెబ్బతీసే దుశ్చర్యగా పరిగణిస్తున్నారు. ప్రచార, ప్రసార, సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రతిపాదిత బిల్లులోని 'బెయిల్ – ఇన్' నిబంధనల పట్ల పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. ఎఫ్.ఆర్.డి.ఐ. ముసాయిదా బిల్లులోని 'బెయిల్ – ఇన్' నిబంధన బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని వమ్ముచేసేదిగా ఉన్నందున్న దీన్ని తొలగించాలని 'అసోచామ్' విజ్ఞప్తి చేస్తోంది.

### ఇదీ నేపథ్యం

ప్రపంచాన్ని కుదిపేసిన 2008 నాటి ఆర్థికమాంద్యం ధాటికి పలుదేశాల ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ దెబ్బకు అమెరికా సహా అనేక దేశాల్లో బ్యాంకింగ్ వ్యవస్థలు కూడా కుప్పకూలాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు దివాలాముఖం పట్టడంతో డిపాజిట్‌దారులు సంక్షోభంలో చిక్కుకున్నారు. నేటికీ కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు ఈ ప్రభావం నుంచి పూర్తిగా కోలుకోలేదు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అంతర్జాతీయ సంస్థలు కొన్ని ఆర్థిక సంక్షోభాలను ముందే పసిగట్టి, దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించాయి. దరిమిలా పలు దేశాలు ఈదిశగా ముందడుగు వేసి చట్టాలను రూపొందించుకుని ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. భారత్‌లో కూడా గత కొన్నేళ్లుగా విస్తృత అధ్యయనం జరిగిన తర్వాతే ప్రతిపాదిత ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లుకు రూపకల్పన జరిగింది.

✤ నేటికీ దాదాపు 75 శాతం జనాభా వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం గడుపుతున్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఉన్న భారతదేశంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల వైఫల్యం కొత్తేమీకాదు. ఎక్కువగా సహకార సంఘాలు, బ్యాంకులు ఈ ప్రభావానికి గురయ్యాయి. పలు సందర్భాల్లో డిపాజిట్‌దారులు భారీ ఎత్తున నష్టపోయారు. దేశంలో గడిచిన 10 – 15 ఏళ్లుగా చేపడుతున్న ఆర్థిక సంస్కరణల మూలంగా ఇలాంటి పరిణామాలకు కొంతమేర అడ్డుకట్ట పడింది. విఫలమవుతున్న, దివాళాకు సిద్ధమవుతున్న బ్యాంకులను ఇతర బ్యాంకుల్లో విలీనం చేయడం ద్వారా, డిపాజిట్‌దార్ల సొమ్ముకు పూర్తి భద్రతను కల్పించడానికి ఆర్.బి.ఐ. పలు కీలక చర్యలను చేపట్టింది. దీంతో 2008 నాటి ఆర్థిక సంక్షోభం భారత్‌పై పెద్దగా ప్రభావం చూపలేదు. 2004లో భారత్‌లో గ్లోబల్‌ట్రస్ట్ బ్యాంక్ అనే ప్రైవేటు సంస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అందులో సొమ్ము దాచుకున్న డిపాజిట్‌దార్లు నష్టపోయే పరిస్థితి నెలకొనడంతో దాన్ని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో విలీనం చేశారు. 2003లో సంక్షోభంలో కూరుకుపోయిన 'నెడుంగడి బ్యాంకు'ను పంజాబ్ నేషనల్ బ్యాంకులో విలీనం చేశారు. అదే విధంగా బెనారస్ స్టేట్ బ్యాంకును బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేశారు. ఈ మూడు సందర్భాల్లోనూ ఆర్.బి.ఐ. కీలక పాత్ర పోషించింది. పతనావస్థలోని బ్యాంకులను పురోగమిస్తున్న, పురోగమనంలో ఉన్న పటిష్టమైన సంస్థల్లో విలీనం చేయడం ద్వారా డిపాజిట్‌దార్ల సొమ్ముకు పూర్తి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంది.

✤ అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక పరిణామాల నేపథ్యంలో భారత్‌లోనూ ఆర్థిక సంస్కరణలు అనివార్యమయ్యాయి. ఇప్పటిదాకా దారితప్పుతున్న ఆర్థిక సంస్థలను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమైన ఆర్.బి.ఐ. దేశంలో విధానపరమైన, ద్రవ్య పరపతి విధానాలు, నియంత్రణ – పర్యవేక్షణలో తలమునకలై ఉండటంతో అప్రాధాన్యమైన అంశాలను దీన్నుంచి తప్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఎఫ్.ఆర్.డి.ఐ. ఏర్పాటు ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది.

**బెయిల్ - ఇన్:** ఈ విధానం కింద బ్యాంకుల్లోని డిపాజిట్‌దార్ల సొమ్మును వినియోగించుకునే వీలుంది. డిపాజిట్ల కాలావధిని మార్చవచ్చు. లేదంటే డిపాజిట్ల మొత్తంలో కొంత భాగాన్నే తిరిగి ఇవ్వొచ్చు. లేదా మొత్తంగా నిలిపేయొచ్చు. డిపాజిట్‌దార్ల సొమ్ముకు భద్రత ఉండదు.

**బెయిల్ - అవుట్:** ఈ విధానం కింద బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు బ్యాంకులకు బయటి నుంచి సహాయం అందిస్తారు. ప్రభుత్వం నుంచి గానీ, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సహాయం చేస్తారు. ఉద్దీపన చర్యలు చేపడతారు. డిపాజిట్‌దార్ల సొమ్ముకు పూర్తి భద్రత ఉంటుంది.

## బిల్లులోని ముఖ్యాంశాలు

- దేశంలో ఇప్పటిదాకా బ్యాంకులు, ఆర్థిక సంస్థల వ్యవహారాలను రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షించేది. బీమా సంస్థల సమస్యలను పరిష్కరించడానికి 'ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఐ.ఆర్.డి.ఎ.) బాధ్యత వహించేది. ఈ బాధ్యతల నుంచి వీటిని తప్పించి 'రిజల్యూషన్ కార్పొరేషన్'కు అప్పగిస్తారు.
- ప్రతిపాదిత 'రిజల్యూషన్ కార్పొరేషన్' కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది.
- దీని కోసం ఛైర్మన్, ఇతర సభ్యులతో కూడిన బోర్డు ఏర్పాటవుతుంది.
- సభ్యులను - ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్.బి.ఐ., సెబీ, ఐ.ఆర్.డి.ఎ., పి.ఎఫ్.ఆర్.డి.ఎ.ల నుంచి ఎంపిక చేస్తారు.
- దేశంలోని ఏదైనా బ్యాంకు, ఆర్థిక సంస్థ, బీమా సంస్థ దివాళా తీస్తున్నట్లుగా సంకేతాలు అందగానే 'రిజల్యూషన్ కార్పొరేషన్' రంగంలోకి దిగి, విఫలమైన సంస్థను తిరిగి పునరుద్ధరించాలా? ఇతర సంస్థల్లో విలీనం చేయాలా? లేక మొత్తానికే మూసేయాలా? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటుంది. ఆ సంస్థ వైఫల్యాల తీవ్రత, ఆర్థిక స్థితిగతులను బట్టి దిద్దుబాటు చర్యలు ఉంటాయి.
- విఫలమైన సంస్థలను 5 రకాలుగా వర్గీకరించి, నష్ట తీవ్రతను బట్టి చర్యలు చేపడతారు.
- 'రిస్క్ స్థాయి'ని బట్టి రిజల్యూషన్ కార్పొరేషన్ పరిష్కార మార్గాలను సూచిస్తుంది.

## పరిష్కార మార్గాలు

సంస్థ ఆస్తులు, అప్పులను వేరే సంస్థకు బదిలీ చేయడం, యాజమాన్య మార్పులు, ఆర్థికపరమైన ప్యాకేజీలు కల్పించి కొనసాగించడం, వేరే సంస్థల్లో విలీనం చేయడం లేదా ఆఖరి పరిష్కారంగా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ద్వారా మూసివేయడం లాంటి పలు ప్రత్యామ్నాయ మార్గాలను 'రిజల్యూషన్ కార్పొరేషన్' సూచిస్తుంది.

- బెయిల్ - ఇన్ నిబంధన కింద విఫలమైన బ్యాంకు లేదా ఆర్థిక సంస్థను గట్టెక్కించేందుకు అప్పులిచ్చిన వారి రుణాలను రద్దు చేసే అధికారం కార్పొరేషన్‌కు ఉంటుంది. డిపాజిట్‌దారుల సొమ్మును పూర్తిగా లేదా కొంత భాగాన్ని దివాళా సంస్థను పునరుద్ధరించేందుకు తాత్కాలికంగా వినియోగించుకునే అధికారాన్ని కార్పొరేషన్‌కు కట్టబెట్టారు. డిపాజిట్‌దార్ల ముందస్తు అనుమతి లేకుండా వారి సొమ్మును ఏ విధంగానైనా వినియోగించుకునే అధికారాన్ని 'బెయిల్ - ఇన్' నిబంధన కార్పొరేషన్‌కు కల్పిస్తోంది.
- డిపాజిట్‌దార్ల సొమ్మును తిరిగి చెల్లించకుండా, అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర సెక్యూరిటీలు, బాండ్ల రూపంలో దీర్ఘకాలంలో చెల్లించేందుకు వీలు కల్పించారు.
- బ్యాంకు డిపాజిట్లకు బీమా సదుపాయాలను కల్పించే 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్' రద్దవుతుంది. దీని స్థానంలోనే 'రిజల్యూషన్ కార్పొరేషన్' ఏర్పాటవుతుంది. ఇది పని ప్రారంభించగానే బ్యాంకులు, ఆర్థిక సంస్థల వైఫల్యాల విషయంలో రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకోదు.
- బిల్లులోని అంశాలన్నీ సానుకూలంగానే ఉన్నప్పటికీ 'బెయిల్ - ఇన్' నిబంధన డిపాజిట్‌దారుల సొమ్ముకు రక్షణ కల్పించడంలో విఫలమైందనేదే ప్రధాన విమర్శ. దీనిపైనే తీవ్రంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## మరింత పారదర్శకత

ఒకవైపు ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లుపై భారీ ఎత్తున వ్యతిరేకత వెల్లడవుతుంటే ఆర్థిక శాఖ మాత్రం ఈ బిల్లుతో డిపాజిట్‌దారులకు ఎలాంటి ప్రమాదం లేదని, ప్రస్తుతం ఉన్న నిబంధనలతో పోలిస్తే మరింత ప్రయోజనం చేకూరుస్తుందని వివరణ ఇచ్చింది. బ్యాంకులు

దివాళా తీస్తే ఖాతాదారుల సొమ్ము కూడా వచ్చే అవకాశం ఉండదంటూ ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలు డిపాజిట్‌దార్ల సొమ్ము భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవని, పైగా ఇప్పటికంటే మరింత పారదర్శకంగా డిపాజిటర్లకు అదనపు రక్షణలు కల్పిస్తుందని ఆర్థికశాఖ స్పష్టం చేసింది.

✤ ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం కింద డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు డిపాజిట్‌దార్లకు కేవలం రూ.లక్ష వరకే రక్షణ కల్పిస్తున్నాయి. లక్షకు మించిన డిపాజిట్లకు ఎలాంటి హామీ లేదని, వాటిని మిగిలిన సాధారణ రుణాలు, అప్పుల మాదిరిగానే పరిగణిస్తున్నారని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. అయితే ప్రతిపాదిత బిల్లులో కూడా రూ.లక్ష వరకు డిపాజిట్లకు పూచీకత్తు ఇస్తూనే, బీమా చేయని డిపాజిట్లకు కూడా మరింత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ రుణాల కంటే ముందే డిపాజిట్‌దార్ల సొమ్ముకు ప్రాధాన్యమిచ్చేలా నిబంధనలు రూపొందించినట్లు తెలిపింది. ఏవిధంగా చూసినా ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు డిపాజిట్‌దార్లకు మరింత సానుకూలంగా ఉంటుందని, ప్రజల సొమ్ముకు ఢోకా ఉండదని ఆర్థికశాఖ భరోసా ఇస్తోంది.

✤ ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు, ఇతర బ్యాంకులకు కూడా ఆర్థిక, ఇతరత్రా విధానాల రూపంలో మద్దతు ఇచ్చే విషయంలో ఈ బిల్లు ప్రభుత్వంపై ఎలాంటి పరిమితులను విధించబోదని స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్రం ఇచ్చే అవ్యక్తమైన పూచీకత్తు/ హామీ అలాగే ఉంటుందని, దానిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని భరోసా ఇచ్చింది. భారతీయ ప్రభుత్వరంగ బ్యాంకులకు సంబంధించి ఎలాంటి ప్రమాదం లేదని, తగినంత మూలధనం ఉందని, బ్యాంకుల భద్రత, ఆర్థిక పరిపుష్టిపై నిరంతరం వివేకవంతమైన, విచక్షణాయుతమైన పర్యవేక్షణ ఉంటుందని ఆర్థికశాఖ పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనలు – బ్యాంకుల నిబద్ధత, భద్రత, సురక్షితను పరిరక్షిస్తున్నాయని, బ్యాంకుల వైఫల్యాలను అరికట్టడంతో పాటు, డిపాజిట్‌దార్ల ప్రయోజనాలను కాపాడేందుకు వీలుగా సాధ్యమైనన్ని విధానపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

✤ ఇప్పుడున్న వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికే ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లును రూపొందించిట్లు కేంద్ర ఆర్థికశాఖ వివరించింది. అదే విధంగా ఎస్.బి.ఐ. పరిశోధనా పత్రం కూడా ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లుపై డిపాజిట్‌దార్ల అభద్రతా భావాన్ని తొలగించడానికి ప్రయత్నం చేసింది. డిపాజిట్‌దార్ల ఖాతాల్లోని సొమ్ము రూ. లక్షకే బీమా సౌకర్యం ఉందని, ఈ మొత్తాన్ని మరింత పెంచేలా ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లులో ప్రతిపాదించినట్లు ఎస్.బి.ఐ. పరిశోధనా పత్రం పేర్కొంది. వాస్తవంలో ఈ బిల్లు ప్రజాధనానికి నష్టభయాన్ని తగ్గించేలా ఉందని ఎస్.బి.ఐ. వివరించింది.

✤ భారత్‌లోని బ్యాంకులు, బీమా కంపెనీలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్టాక్ ఎక్స్ఛేంజీలు సంక్షోభంలో కూరుకుపోకుండా పర్యవేక్షించడానికి ఎఫ్.ఆర్.డి.ఐ. ముసాయిదా బిల్లులో నిబంధనలను రూపొందించినట్లు ఎస్.బి.ఐ. నివేదిక పేర్కొంటోంది. మొత్తానికి రిజల్యూషన్ కార్పొరేషన్ ద్వారా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు సంక్షోభానికి గురవకుండా కాపాడవచ్చని, అలాంటి బ్యాంకులు చెల్లించాల్సిన రుణాలను రద్దు చేయడం ద్వారా వాటిని కాపాడతారని దీన్నే ప్రతిపాదిత బిల్లులో 'బెయిల్ – ఇన్'గా వ్యాఖ్యానించారని ఎస్.బి.ఐ. చెబుతోంది. మొత్తానికి 'బెయిల్ – ఇన్' నిబంధన డిపాజిట్‌దార్ల సొమ్ముకు భద్రతకు, భరోసా ఇస్తుందని తద్వారా ఆర్థిక సుస్థిరతకు మార్గం సుగమమవుతుందని కేంద్ర ప్రభుత్వం, ఎస్.బి.ఐ. పరిశోధనా పత్రం ఉద్ఘాటిస్తున్నాయి.

✤ దేశంలోని బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇతర ఆర్థిక సంస్థలు సంక్షోభాల ఊబిలో కూరుకుపోకుండా పర్యవేక్షించడానికి పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఎఫ్.ఆర్.డి.ఐ. ద్వారా ఏర్పాటు చేసి, డిపాజిట్‌దార్ల సొమ్ముకు భరోసా కల్పించి, ఆర్థిక వ్యవస్థను సుస్థిర ప్రగతి సాధన దిశగా పారదర్శకంగా నడిపించడానికి ఉద్దేశించిన కీలక సంస్కరణగా ప్రభుత్వం దీన్ని పేర్కొంటోంది.

లక్షలాది మంది మధ్యతరగతి ప్రజానీకం చెమటోడ్చి సంపాదించుకున్న సొమ్మును భద్రత కోసమే బ్యాంకుల్లో దాచుకుంటారు. కాబట్టి డిపాజిట్‌దారుల సొమ్ముకు పూర్తిస్థాయి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రత్యేకంగా సామాజిక భద్రత కొరవడిన పింఛన్‌దారులు, వృద్ధులకు బ్యాంకు డిపాజిట్లే ఆధారం.

"బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు దివాళా తీసేటువంటి విపత్కర పరిస్థితులకు గురైనపుడు, వాటిని పరిరక్షించే బాధ్యతను, ప్రభుత్వంతో పాటు, డిపాజిట్‌దారులకూ కట్టబెట్టాలన్న ప్రయత్నమే ఈ బెయిల్ – ఇన్" **– డి.ఎస్. రావత్, అసోచామ్ సెక్రటరీ జనరల్**

**రచయిత: డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్**